క్లుప్తంగా

ముత్యాలమ్మకు క్షీరాభిషేకం



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

తాళ్లరేవు: పవిత్ర వైశాఖ పౌర్ణమి పర్వదినం సందర్భంగా గురువారం పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారికి క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి సత్య శ్రీనివాసాచార్యులు అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా చొల్లంగిపేట గ్రామానికి చెందిన నరాల అప్పారావు, లక్ష్మీ రుక్మిణి దంపతులతో అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేయించారు. అనంతరం అమ్మవారికి ఊంజల్ సేవ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు విళ్ల సత్యనారాయణ, పితాని వీరబాబు, శెట్టి దొరబాబు, ఉంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి గొల్లబాబు, అందే కాశీరాజు, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి సమ్మర్ క్యాంప్



సమ్మర్ క్యాంప్ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధులు

తాళ్లరేవు: ఈ నెల 26 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు చిన్నారులకు సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్లు చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ గుత్తుల మల్లేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో సమ్మర్ క్యాంప్ బ్రోచర్లను క్లబ్ ప్రతినిధులు ఆవిష్కరించారు. సమ్మర్ క్యాంప్‌లో చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారికి బహుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తామన్నారు. ఈ సందర్భంగా చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, ఆటల, పాటల పోటీలు నిర్వహించనున్నామన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో సమ్మర్ క్యాంప్ జరుపుతామని మల్లేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వడ్డి ఏడుకొండలు, అత్తిలి బాబూరావు, సుందరపల్లి సత్యనారాయణ, పాలిక శ్రీనివాస్, కృష్ణ, దిలీప్, గురుశంకర్, మల్లేష్, ఈశ్వరరావు, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం



ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో భద్రకాళీ అమ్మవారికి చండీ హోమం ఘనంగా జరిగింది. ఆలయంలో పౌర్ణమి తిథిని పురస్కరించుకుని గురువారం ఆలయ అర్చకస్వామి పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో పలువురు పండితులచే గణపతి పూజ, పుణ్యాహవచనం, చండీ పారాయణ, చండీ హోమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు నిత్యవసరాలను అందిస్తున్న చిందాడగరువు సర్పంచ్ కనకదుర్గ

అల్లవరం: ఇటీవల కోడూరుపాడులో అగ్ని ప్రమాదం జరిగి సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులైన కొడమంచిలి మంగాదేవి, ఉదయ భాస్కర్‌లకు చిందాడగరువు ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ రూ.5 వేల ఆర్థిక సాయం, నిత్యవసరాలు, దుప్పట్లు గురువారం అందజేశారు. కార్యక్రమంలో కోడూరుపాడు సర్పంచ్ నడింపల్లి సుబ్రహ్మణ్యంరాజు, పల్లి ప్రసాద్, కంకిపాటి వీరబాబు, గుమ్మల తాతాయ్యనాయుడు, కటికిరెడ్డి బాబి, అయితాబత్తుల నాగేశ్వరరావు, కుంపట్ల రాజు పాల్గొన్నారు.

చిన్నారులకు పోషకాహార కిట్ల పంపిణీ

అమలాపురం టౌన్: జన కల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక వంటెద్దువారి వీధిలో హెచ్ఐవీ సోకిన చిన్నారులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, కల్వకొలను ఉమ, కె.రిత్విక్, జల్లి సుజాత, గారపాటి శేఖర్, సీహెచ్ ప్రసన్న సౌజన్యంతో ఈ వితరణ కార్యక్రమం జరిగింది. చీకట్ల చిన్నా బాధిత చిన్నారులకు దుప్పట్లు సమకూర్చారు. కార్యక్రమంలో జనకల్యాణ్ శ్రీనివాస్, కాండ్రేగుల రేవతి, బోణం అప్పారావు, తిక్కా బాబి, మోరం రవి, సికిలే బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాక్ డ్రిల్‌లో రాళ్లు రువ్వుతున్న అల్లరి మూకలు



మాక్ డ్రిల్‌లో అల్లరి మూకలను చెదరగొడుతున్న పోలీసు బలగాలు

హింసాత్మక ఘటనలపై పోలీస్ యాక్షన్

- ఆలోచింపజేసిన పోలీసుల మాక్ డ్రిల్
- విద్రోహ శక్తులు, అల్లరి మూకలకు హెచ్చరిక

అమలాపురం టౌన్: ఓట్ల లెక్కింపు జరుగుతున్న సమయంలో రెచ్చగొట్టడం లేదా విజయోత్సవాల ముసుగులో విధ్వంసాలకు పాల్పడే విద్రోహ శక్తులు, అల్లరి మూకలపై కేంద్ర బలగాలు, పోలీసుల యాక్షన్ ఎంత సీరియస్‌గా ఉంటుందో మాక్ డ్రిల్ అద్దం పట్టింది. జిల్లా ఎస్పీ సునరావు శ్రీధర్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు యంత్రాంగం, కేంద్ర బలగాలు సంయుక్తంగా స్థానిక గడియారం స్తంభం సెంటరులో గురువారం సాయంత్రం చేసిన మాక్ డ్రిల్ అందరినీ ఆలోచింపజేసింది. ఇప్పటికే కేంద్ర బలగాల కవాతు ద్వారా పోలీసు అధికారులు జిల్లావ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అయితే ఓట్ల లెక్కింపు రోజున



ఆందోళకారులపై వాటర్ క్యానన్ ఉపయోగిస్తున్న కేంద్ర బలగాలు

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, ఎవరైనా ఘర్షణలకు కాలు దువ్వినా పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయో మాక్ డ్రిల్ కళ్లకు కట్టింది. వాస్తవ పరిస్థితులు జరుగుతున్నట్లుగానే పాత్రలను కల్పించి సన్నివేశాన్ని సృష్టించి ప్రజలకు అవగతమయ్యేలా మాక్ డ్రిల్ నిర్వహించారు. అల్లరి మూకలు రాళ్లు రువ్వితే పోలీసులు బాధ్యులను ఎలా శిక్షిస్తారో ప్రదర్శించి చూపించారు. ఆందోళన కారులపై వాటర్ క్యానన్ ప్రయోగించే ప్రక్రియను కూడా ప్రయోగాత్మకంగా నిర్వహించారు. అల్లర్లు, ఘర్షణల్లో ఎవరైనా గాయపడితే తక్షణమే అంబులెన్స్‌లో ఆస్పత్రికి పంపించే సన్నివేశాన్ని కూడా చూపించారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసులు ఎంత ధీటుగా స్పందిస్తారో తెలియజెప్పారు. ఓట్ల లెక్కింపు రోజున



ఘర్షణల్లో గాయపడ్డ వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న కేంద్ర బలగాలు



మాక్ డ్రిల్‌ను వీక్షిస్తున్న జిల్లా ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ బాషా, డీఎస్పీలు, సీఐలు

జిల్లాలో ఎవరైనా అల్లర్లకు తెగబడితే పోలీసు చర్యలు ఎలా ఉంటాయో అవగాహన కల్పించి హెచ్చరించేందుకే ఈ మాక్ డ్రిల్ నిర్వహించినట్లు ఎస్పీ శ్రీధర్ తెలిపారు. మాక్ డ్రిల్‌ను జిల్లా ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు వీక్షించి పర్యవేక్షించారు. మాక్ డ్రిల్‌లో దాదాపు 200 మంది జిల్లా పోలీసులు, కేంద్ర బలగాల గార్డులు పాల్గొన్నారు.

ఘనంగా లలితాదేవి ఆలయ వార్షికోత్సవం

యానాం: పట్టణంలోని పడవల రేవు వీధిలో కొలువైన శ్రీలలితాదేవి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠా వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారి ఆలయం వద్ద విశేష పూజలు జరిపారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు లలితాదేవి దర్శనం చేసుకుని అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో శ్రీలలితా భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణం



ప్రత్యేక అలంకరణలో సత్యనారాయణస్వామి

అమలాపురం రూరల్: మండలంలోని నవరప్పాలెం గ్రామంలో వేంచేసి ఉన్న రమా సత్యనారాయణ స్వామి, అంబికా విశ్వేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. గురువారం వైశాఖ పౌర్ణమి సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామివారి ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సత్తి శ్రీనివాసరావు, సత్తి బాలకృష్ణమూర్తి, సత్యనారాయణ, సత్తి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుని బోధనలు అనుసరణీయం



బుద్ధా పార్క్‌లో బుద్ధుని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బౌద్ధులు



ముమ్మిడివరంలో బుద్ధుని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

యానాం: శాంతియుత సమాజానికి బుద్ధుని బోధనలు అనుసరణీయమని సౌత్ ఇండియా దళితసాహిత్య అకాడమీ అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి అన్నారు. వైశాఖ పూర్ణిమను పురస్కరించుకుని గురువారం స్థానిక అంబేడ్కర్‌నగర్ బుద్ధా పార్క్‌లో గౌతమబుద్ధుని 2568వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సంక్షేమసంఘం, బౌద్ధసంఘం ఆధ్వర్యంలో పార్క్‌లో గౌతమబుద్ధుని విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పొనుగుమట్ల విష్ణుమూర్తి మాట్లాడుతూ సుమారు 45 ఏళ్ల పాటు అనేక ప్రాంతాల్లో పర్యటించి సత్యమార్గాన్ని, సిద్ధాంతాలను బుద్ధుడు బోధించారన్నారు. బుద్ధుడు బోధించిన పంచశీల, అష్టాంగమార్గాలు సమాజానికి అవసరమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్ఏఓ నామాడి అప్పారావు, గుర్రపు ప్రహ్లాదుడు, మట్టా శ్రీనివాస్,



అమలాపురంలో బుద్ధ వందనం చేస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

కోరుకొండ రాజేంద్రప్రసాద్, తిరుకోటి నాగేశ్వరరావు, కోరుకొండ నాగేశ్వరరావు, తాటిపాక దుర్గబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌతమ బుద్ధుని జయంతి

ముమ్మిడివరం: స్థానిక బుద్ధ పార్కులో గౌతమ బుద్ధుని జయంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ మెమోరియల్, అభ్యుదయ సంఘాల సభ్యులు బుద్ధుని విగ్రహానికి పుష్పాలంకరణ చేసి నివాళులర్పించారు. మాజీ ఏపీపీ కాశీ బాబూ జగ్జీవన్ రావు బౌద్ధ పతాకాన్ని ఆవిష్కరించారు. కాశీ సింహాద్రివర్యులు, యలమంచిలి బాలరాజు, కాశి సత్యనారాయణలు బుద్ధ వందనం చేశారు. కార్యక్రమంలో న్యాయవాది వడ్డి నాగేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, తటవర్తి నాగరాజారావు, పి.ఉదయ భాస్కరవర్మ, పీవీఎస్ఎన్ వర్మ, ఎన్.అబ్బులు, మట్టా శ్రీను, ఎస్‌వీ సత్యనారాయణ, పీవీ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: స్థానిక త్రిరత్న బుద్ధ విహార్‌లో బుద్ధ జయంతిని పురస్కరించుకుని రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు బుద్ధుని విగ్రహం వద్ద బుద్ధ వందనం చేశారు. బౌద్ధ భిక్షువులచే ప్రార్థన నిర్వహించారు. బుద్ధుని ప్రతిమతో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అమలాపురం పట్టణంలో అంబేడ్కర్ భవన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ దేశానికి గౌతమ బుద్ధుడి బోధనలు అవసరమన్నారు. కార్యక్రమంలో బీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీవీ దుర్గారావు, జిల్లా అధ్యక్షుడు రాంబోది కాశి, ప్రధాన కార్యదర్శి ఈవీవీ సత్యనారాయణ, డీబీ లోక్ పాల్గొన్నారు.

అలరించిన అన్నమయ్య కీర్తనలు



అన్నమయ్య కీర్తనలను ఆలపిస్తున్న మహిళలు

అమలాపురం టౌన్: అన్నమయ్య 600వ జయంతి సందర్భంగా స్థానిక భూపయ్య అగ్రహారంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆర్ట్ ఫ్యామిలీ ఆధర్యంలో అన్నమయ్య కీర్తల ఆలాపన, కోలాటం భక్తులను అలరించాయి. గురువారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఫ్యామిలీ ప్రతినిధులైన మహిళలు అన్నమయ్య, రామదాసు కీర్తనలను రాగయుక్తంగా ఆలపించారు. కోలాటం లయబద్ధంగా సాగింది. ఆర్ట్ ఫ్యామిలీ ప్రతినిధులు టి.సౌమ్య లక్ష్మి, పేరి వాణి, ఉషారాణి వారి శిష్య బృందం ఆధ్వర్యంలో కీర్తనల ఆలాపన, కోలాట కార్యక్రమాలు జరిగాయి. మృదంగం రఘునాథ్, వయొలిన్ గణపతి వాద్య సహకారం అందించారు. ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, భూపయ్య అగ్రహారం పెద్దలు కొత్తూరి శ్రీనివాస్, జిల్లెళ్ల గోపాల్, బాల భక్త సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని గరుడ వాహనోత్సవం



బండారులంకలో గరుడ వాహనంపై స్వామివారి వాహనోత్సవం

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక బిళ్లవారి వీధిలో వేంచేసియున్న పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాల సందర్భంగా గురువారం ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్ల వాహనోత్సవం నిర్వహించారు. వైశాఖ పౌర్ణిమ సందర్భంగా మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య పురవీధుల్లో ఊరేగింపు సాగింది. దారి పొడవునా మహిళలు స్వామి, అమ్మవార్లకు మంగళ హారతులు సమర్పించారు. తొలుత బిళ్ల విశ్వేశ్వరరావు, వీరభద్ర కాళీ దంపతులచే స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. పూజల్లో ఎంపీటీసీ సభ్యురాలు అంకం హిమ భారతి, కొప్పాడి దుర్గారావు, లంకాడి శీను, లంకాడి ప్రసాద్, ఓలేటి శ్రీనివాసరావు, శ్రీనివాసా బాలమిత్ర సంఘ ప్రతినిధులు చింతపట్ల బాబు, అంకం పెదరాజు, ఓలేటి నాగరాజు, బల్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

ద్రవ నత్రజని పాత్రల పంపిణీ



పశు వైద్య సహాయకులకు నత్రజని పాత్రలను పంపిణీ చేస్తున్న ఉప సంచాలకులు డాక్టర్ మూర్తి, సహాయ సంచాలకులు డాక్టర్ విజయరెడ్డి

అమలాపురం టౌన్: స్థానిక ఏరియా పశు వైద్యశాల వద్ద కోనసీమలోని పలు మండలాల పశు వైద్య సహాయకులకు ట్రాన్స్‌పోర్ట్ మోడల్ ద్రవ నత్రజని పాత్రలను పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ కర్నీడి మూర్తి, సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఎదకు వచ్చిన పశువులను చూడి కట్టించేందుకు ఎక్కువ దూరం తీసుకెళ్లనవసరం లేకుండా ఇంటి వద్దే ద్రవ నత్రజని పాత్రల ద్వారా కృత్రిమ గర్భధారణ చేయడం వీలవుతుందని పశు వైద్యాధికారులు తెలిపారు. అమలాపురం రూరల్ మండలం గున్నేపల్లి అగ్రహారం, అల్లవరం మండలం బోడసకుర్రు, తుమ్మలపల్లి, అంబాజీపేట మండలం గంగలకుర్తి అగ్రహారం, పి.గన్నవరం మండలం పోతవరం, కుదాలపల్లి గ్రామాల పశు వైద్య సహాయకులకు ఈ నత్రజని పాత్రలను అందజేశారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు సాయినాథ్, మణికంఠ, అశోక్, చినబాబు, రాజీవ్, వెంకటేశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్సీ నర్సింగ్‌లో ప్రవేశాలకు ఉమ్మడి పరీక్ష

యానాం: 2024–25 విద్యా సంవత్సరం నుంచి బీఎస్సీ నర్సింగ్ కోర్సు అడ్మిషన్లకు సంబంధించి కామన్ ఎంట్రన్స్ పరీక్షను నిర్వహించనున్నట్లు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ శ్రీరాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రవేశ పరీక్షకు సంబంధించి సెంటాక్ అడ్మిషన్ కమిటీ నోటీసు జారీ చేసిందన్నారు. అభ్యర్థులు సెంటాక్‌లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుని కామన్ ఎంట్రన్స్ టెస్ట్ రాయాలని సూచించారు. పుదుచ్చేరి వ్యాప్తంగా 15 కాలేజీల్లో 880 బీఎస్సీ నర్సింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఏడాది నుంచి యానాంలో 40 సీట్లతో నర్సింగ్ కాలేజీని ప్రారంభించడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని తెలిపారు.

28న సర్వసభ్య సమావేశం

కాట్రేనికోన: ఈ నెల 28న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. ఎంపీపీ పాలెపు లక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

జేసీబీ, రెండు ట్రాక్టర్ల సీజ్



మట్టి తవ్వకాలను అడ్డుకున్న తహసీల్దార్ ప్రశాంతి

కాట్రేనికోన: మండలంలోని పల్లంకుర్రు శివారు చీకురుమిల్లి వారి పేట సమీపంలో మట్టిని అక్రమంగా తవ్వుతున్న జేసీబీతో పాటు మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. గ్రామంలో సీతారామ దేవస్థానానికి చెందిన భూమిలో మట్టి అక్రమ తవ్వకాలపై స్థానికులు కాట్రేనికోన తహసీల్దార్ డి.ప్రశాంతికి ఫిర్యాదుచేశారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఆమె మట్టి తవ్వకాలను అడ్డుకుని అనుమతులు లేకుండా మట్టిని తవ్వుతున్న జేసీబీ, మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టి అక్రమంగా తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గోవును సంరక్షించిన గ్రామస్తులు



గోవును ఊబిలోంచి బయటకు తెచ్చిన గ్రామస్తులు

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధి వాసాలతిప్పలో ఆపదలో ఉన్న గోవును గ్రామస్తులు రక్షించారు. గ్రామానికి చెందిన ఒక అనాథ ఆవు మేతకు వెళ్లి పంట బోదెలో దిగి గత రెండు రోజులుగా ఊబిలో కూరుకుపోయి బయటకు రాలేక అపస్మారక స్థితికి చేరుకుంది. ఈ విషయాన్ని గుర్తించిన నక్కా రామేశ్వరానికి చెందిన యువకులు ఆవును సురక్షితంగా బయటకు తీసి స్థానిక పశువైద్యాధికారి కోనే రామారావుకు సమాచారం అందించారు. రామారావు సహాయకులు గాంధీతో కలిసి ఆవుకు వైద్యం అందించారు. ఆవు ప్రాణాలను కాపాడిన యువకులను, వైద్యులను గ్రామస్తులు అభినందించారు.

ఉప్పలగుప్తంలో సినీ సందడి



ఉప్పలగుప్తంలో జాతర సన్నివేశాలను చిత్రీకరిస్తున్న సినిమా బృందం

ఉప్పలగుప్తం: మండల కేంద్రమైన ఉప్పలగుప్తంలో సినిమా షూటింగ్‌తో సందడి నెలకొంది. గ్రామానికి చెందిన యువ డైరెక్టర్ మోటూరి చైతన్య సాయంకాలపు సిత్రాలు(ఎస్ఎస్) బ్యానర్‌పై దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు సంబంధించి జాతర సన్నివేశాలను గురువారం చిత్రీకరించారు. ఈ చిత్రంలో కథానాయకుడిగా వికాస్, హీరోయిన్‌గా మౌనిక, విలన్‌గా రఘు కుంచే నటిస్తున్నారని నిర్మాత మోటూరి వాణి రవికుమార్ తెలిపారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించి హైదరాబాద్, విశాఖపట్టణం, కాకినాడ, మారేడుమిల్లి ప్రాంతాల్లో దాదాపు 50 శాతం షూటింగ్ పూర్తి చేసుకుందని వివరించారు. ఆగస్టు నాటికి షూటింగ్ పూర్తి చేసుకుని ప్రేక్షకుల ముందుకు సినిమాను తీసుకొస్తామని తెలిపారు.

సీఆర్పీ సత్యనారాయణ కుటుంబానికి ఆర్థిక సాయం



సత్యనారాయణ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎంఈఓలు కిరణ్‌బాబు, ఏడుకొండలు

అల్లవరం: మండల విద్యా శాఖలో సీఆర్పీగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతి చెందిన కాండ్రేగుల రామ సత్యనారాయణ కుటుంబానికి అల్లవరం మండల విద్యా శాఖ సీఆర్‌పీలు, పీటీఐ, ఐఈఆర్‌టీలు సంయుక్తంగా రూ.1.50 లక్షల నగదు, ఎస్‌బీఐ డిపాజిట్ రూ.20 వేలను గురువారం అందజేశారు. మొగళ్లమూరులోని రామ సత్యనారాయణ కుటుంబాన్ని ఎంఈఓలు కిరణ్‌బాబు, ఏడుకొండలు, ఎస్‌టీయూ, యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్‌వీపీజీ నాయుడు, రత్నరాజు, కేఎస్‌వీ సత్యనారాయణ, శివప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పేద కార్మికుని వైద్యానికి ఆర్థిక సాయం



బాధితుడి తల్లికి నగదు అందజేస్తున్న పినపోతు కుటుంబ సభ్యులు

తాళ్లరేవు: కాలేయ, క్లోమ వ్యాధులతో బాధపడుతూ ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తాళ్లరేవు రచ్చవారిపేట గ్రామానికి చెందిన విజయ్‌కుమార్‌కు పలువురు రూ.35 వేల ఆర్థిక సాయం చేశారు. పేద కార్మికునికి పెద్ద కష్టం శీర్షికన ఇటీవల సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి మానవతావాదులు స్పందించారు. బాధితుడి గ్రామానికే చెందిన పినపోతు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు, మిత్ర బృందం రూ.20 వేల నగదును అమలాపురంలో కిమ్స్ ఆస్పత్రికి వెళ్లి బాధితుడి తల్లి కామేశ్వరికి అందజేశారు. తాళ్లరేవు పరిరక్షణ సమితి వాట్సాప్ గ్రూప్ సాయంతో పలువురు సభ్యులు బాధితుని కుటుంబ సభ్యులకు ఫోన్‌పే ద్వారా సుమారు రూ.15 వేల ఆర్థిక సాయం చేశారు. దాతలకు బాధితుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర జూడో సంఘ ప్యాట్రన్‌గా అప్పాజీ



అమలాపురం రూరల్: రాష్ట్ర జూడో సంఘ ప్యాట్రన్‌గా అమలాపురం మండలం ఇందుపల్లి గ్రామానికి చెందిన చొల్లంగి అప్పాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీ జూడో అసోసియేషన్ చైర్మన్ అడవరం నాగురయ్య ఆధ్వర్యంలో గురువారం జరిగిన రాష్ట్ర జూడో సంఘ వార్షిక సర్వసభ్య సమావేశంలో అప్పాజీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అప్పాజీ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో జూడో క్రీడ కార్యాలయాలు స్థాపించి ఆడపిల్లలందరికీ ఆత్మరక్షణగా జూడో క్రీడలో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. అప్పాజీని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు అభినందించారు.